క్లుప్తంగా...

కార్పొరేట్ కళాశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ కళాశాలల పథకం కింద జూనియర్ కళాశాలలు రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జి.వినోద్ కుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రైవేట్ జూనియర్ కళాశాలలు సంబంధిత డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొనారు. పేరొందిన జూనియర్ కళాశాలలను జిల్లా ఎంపిక కమిటీ షార్ట్‌లిస్ట్ తయారు చేస్తుందన్నారు. అన్ని ప్రాథమిక సౌకర్యాలతో చాలినంత మంచి వసతి, జేఈఈ/ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షలో ఏకరీతిలో అధిక సక్సెస్ రేటును కలిగి ఉండాలన్నారు. నియమావళితో సహా పూర్తి వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఈ-పాస్‌లో కళాశాల రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 15 వరకు చేసుకోవచ్చని తెలిపారు.

కీసర సీఐ రఘువీర్‌రెడ్డికి ఉత్తమ సేవా పథకం



అవార్డు అందుకుంటున్న కీసర సీఐ రఘువీర్‌రెడ్డి

కీసర/ఘట్‌కేసర్: కీసర పోలీస్ స్టేషన్ సీఐ రఘువీర్‌రెడ్డి ఉత్తమ సేవా పథకం అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నగరంలో గురువారం జరిగిన సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కీసర పోలీసులు సీఐకి అభినందనలు తెలిపారు.

సాయం చేయడంలోనే ఆనందం



జవహర్‌నగర్: నిరుపేదలకు సహాయం అందించడంలోనే ఆనందం ఉందని జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం చెన్నాపురంలోని శ్రీకృష్ణపురి కాలనీకి చెందిన బైరోజు పరమేశ్వరీ కూతురు లావణ్య వివాహానికి డిప్యూటీ మేయర్ దంపతులు నాగరాణి శ్రీనివాస్‌లు పుస్తె మెట్టెలు, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల పెండ్లికి కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి రూ.లక్షా16 వేలు అంజేస్తోందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతారం అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

శామీర్‌పేట్: అనంతారం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలాడుతూ లభ్యమైన ఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం అనంతారం అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు వ్యక్తి ఉరి వేసుకున్నట్లు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన రెడ్డిబాబు(45), భార్యతో కలిసి కొన్నేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా ములుగు మండలం, వాగునూతికి వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై నిత్యం మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో తన భార్య మంగిబాయి గత నెల 20న గుంటూరుకు వెళ్లింది. మద్యానికి భానిసై అనంతారం గ్రామ పరిధిలోని అటవీప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గోడ కూలి కార్మికుడి మృతి

కీసర/ఘట్‌కేసర్: గోడ కూలిన ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన కీసర పీఎస్ పరిధిలో గురువారం జరిగింది. సీఐ రఘువీర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి శాస్త్రీనగర్ ఎంఎంఆర్ ఎక్విప్మెంట్ కంపెనీలో ప్రస్తుతం గోడ నిర్మిస్తున్నారు. గోడ నిర్మాణంలో నాణ్యత లోపం, వర్షం కారణంగా అతడిపై గోడ కూలి నాగారం ఎస్వీనగర్‌లో నివసిస్తున్న ఏపీ గిద్దలూరుకు చెందిన గన్నవరం వెంకటేశ్వర్లు(58) అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యజమాని నిర్లక్ష్యం చేశాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

15 రోజుల్లో చెల్లింపులపై ఫోకస్

జీవో 59 కింద అర్హత సాధించిన దరఖాస్తుదారులు 12,595 మంది



- మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు సొమ్ము చెల్లించిన వారు 2,800
- చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించిన వారి సంఖ్య 6,200 మంది
- రూ.3 నుంచి రూ.5 లక్షలలోపు సొమ్ము చెల్లింపుపైనే దృష్టి
- సర్కారు ఆదేశాలతో రంగంలోకి జిల్లా రెవెన్యూ శాఖ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూముల్లో నివాసిత ఇళ్ల క్రమబద్ధీకరణలో భాగంగా జీఓ 59 కింద అర్హత సాధించిన దరఖాస్తుదారులు గడువులోగా సొమ్ము చెల్లింపులు చేసేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అర్హత పొందిన దరఖాస్తుదారుల్లో రూ.3లక్షల నుంచి రూ.5 లక్షలలోపు సొమ్ము చెల్లించాల్సిన వారిని గుర్తించి, వారితో 15 రోజుల్లో సొమ్ము చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జీవో 59 కింద అర్హత సాధించిన దరఖాస్తులను వడపోసిన రెవెన్యూ శాఖ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 9 వేల మంది ఉన్నట్లు నిర్ధారించింది. ఇందులో 2,800 మంది దరఖాస్తుదారులు సొమ్ము చెల్లించగా, మిగిలిన 6,200 మంది దరఖాస్తుదారులతో కూడా సకాలంలో చెల్లింపుల కోసం ప్రత్యేక కార్యాచరణతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది.

59 కింద అర్హత సాధించినవి 12,595 మాత్రమే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీవో 59 కింద భూక్రమబద్ధీకరణకు సంబంధించి 28,280 దరఖాస్తులు రాగా, ఇందులో కుత్బుల్లాపూర్ మండలంలో 14,518 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కాప్రాలో 5,081, కూకట్‌పల్లిలో 5,055, ఉప్పల్‌లో 457, దుండిగల్‌లో 1,656, మల్కాజిగిరిలో 1,424, బాచుపల్లిలో 1,412, మేడిపల్లిలో 583, బాలానగర్‌లో 389 మంది దరఖాస్తు చేశారు. కీసరలో 697, ఘట్‌కేసర్‌లో 623, శామీర్‌పేటలో 677, అల్వాల్‌లో 346, మేడ్చల్‌లో 311, ఎంసీపల్లిలో 29 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు అందాయి. వీటి పరిశీలన అనంతరం 12,595 దరఖాస్తులు మాత్రమే అర్హత సాధించినట్లు రెవెన్యూ శాఖ పేర్కొంది.

గడువు పెంపుతో.. ప్రజల్లో అవగాహన

జీవో 58, 59 కింద మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పెంచడంతో అర్హులైన వారి నుంచి ఎక్కువ సంఖ్యలో జీవో 58 కింద దరఖాస్తు చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అవగాహన కల్పిస్తున్నారు. కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జీవో 58 కింద ఎక్కువగా దరఖాస్తులు రానున్నట్లు తెలుస్తోంది.

రూ.10 లక్షలకుపైగా చెల్లించేవారు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హత సాధించిన దరఖాస్తుదారుల్లో రూ.10 లక్షలకు మించి ఉన్న వారు సొమ్ము చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత మార్కెట్ విలువను లెక్క గట్టి రూ.లక్షల్లో సొమ్ము చెల్లించాలని నోటీసులు అందజేయడమే ఇందుకు కారణంగా లబ్ధిదారులు పేర్కొంటున్నారు. 45 రోజుల వ్యవధిలోనే మొత్తం సొమ్ము చెల్లించాల్సి రావడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

జీవో 58 కింద 9,169 మంది లబ్ధిదారులకు పట్టాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీవో 58 కింద 38,108 దరఖాస్తులు రాగా, తుది పరిశీలన తదనంతరం 9,169 దరఖాస్తులు అర్హత సాధించినట్లు రెవెన్యూ యంత్రాంగం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మండలాలు, గ్రామాలు, పురపాలక సంఘాల వారీగా సంబంధిత లబ్ధిదారులకు పట్టాలను జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు పంపిణీ చేశారు. జవహర్‌నగర్‌లోనే 3,619 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు.

'పది'లో సత్తాచాటిన ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు


సిమ్రాన్ (9.5) మానస (9.5) గగనశ్రీ (9.5)

మేడ్చల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 589మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 474 మంది ఉత్తీర్ణత చెంది 80.74శాతం పాస్ పర్సెంటేజీని సాధించారని ఎంఈఓ వసంత కుమారి తెలిపారు. మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.శ్రీకాంత్, బాలికల పాఠశాలకు చెందిన ఎస్‌కె రోహిణి, టి.అక్షర 9.7 జీపీఏ సాధించి మండల ప్రభుత్వ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచారు. గుండ్లపోచంపల్లికి చెందిన మానస, సిమ్రాన్, రావల్‌కోల్‌కు చెందిన టి.శ్రావణి, గిర్మాపూర్‌కు చెందిన అడ్విన్ మోజెస్‌లు 9.5 జీపీఏలు సాధించి ద్వితీయస్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఈఓ వసంతకుమారి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీచైతన్య హవా

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గుండ్లపోచంపల్లి శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలలో 190 పరీక్షలు రాయగా 20మంది 10/10 జీపీఏలు సాధించారు. 45మంది 9.8 జీపీఏ, 69మంది 9.7 జీపీఏలు, 80మంది, 9.3 జీపీఏలు 92మంది, 9.2 జీపీఏలు 106మంది సాధించారు. 99శాతం పాస్ పర్సెంటేజీ సాధించారని తెలిపారు. విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్ సీమా, డీన్ రమణారావు, ప్రిన్సిపాల్ జితేందర్ తదితరులు అభినందించారు.

మెరిసిన జవహర్‌నగర్ స్కూల్ విద్యార్థులు

జవహర్‌నగర్: పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 102 మంది ఉత్తీర్ణులయ్యారు. 75.5 శాతం సాధించారు. అందులో రాళ్లదండి యశ్వంత్, వెంకట రవిశంకర్ 9.8 జీపీఏ సాధించారు. బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో 128 విద్యార్థులు పది పరీక్షలు రాయగా అందులో 77 మంది ఉత్తీర్ణులై 60 శాతానికే పరిమితమయ్యారు.

ఘట్‌కేసర్ మండలంలో 86.96 ఉత్తీర్ణత


ఐశ్వర్య(9.8) నవ్య(9.8) రక్షిత(9.7) సౌమ్య(9.7)

ఘట్‌కేసర్: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 86.96 ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 276 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 240 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. పట్టణంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన ఐశ్వర్య, ఏలాదుబాద్‌కు చెందిన నవ్య 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. జెడ్పీ కొర్రెముల్ పాఠశాలకు చెందిన రక్షిత, జెడ్పీ ఏదులాబాద్ పాఠశాలకు చెందిన సౌమ్య 9.7 సాధించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శశిధర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందనలు తెలిపారు.

పదిలో మండల టాపర్‌కు సన్మానం

ఘట్‌కేసర్: పదో తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచిన పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థిని ఐశ్వర్యను మున్సిపల్ చైర్మన్ పర్సన్ పావనీజంగయ్య సన్మానించారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో మిఠాయి తినిపించి అభినందించారు. 9.5 జీపీఏ సాధించిన హేమాగ్ని, అంబిక, నిషాంత్ సుల్తానాను హెచ్‌ఎం అనితతో కలిసి అభినందించారు.


ఐశ్వర్య(9.8)ను సత్కరిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ప్రియాంక హామీలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేరుస్తాం

- అధికారంలోకి రాగానే అమలు పరుస్తాం
- సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్


సమావేశంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూరేలా యువ సంఘర్షణ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు పరుస్తామని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తెలిపారు. బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతను ఉద్యమ అమరవీరులుగా గుర్తించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు తల్లితండ్రులు లేదా భార్యకు రూ.25 వేల నెలవారీ అమరవీరుల గౌరవ పెన్షన్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తామన్నారు. ప్రతి ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17లోపు నియామకాలు పూర్తి చేస్తామన్నారు.

ప్రతినెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతినెలా రూ.4 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని తెలిపారు. ప్రత్యేక చట్టంతో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో పునరుద్ధరిస్తామన్నారు. ప్రియాంక గాంధీ హైదరాబాద్ సభలో ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ భుజస్కందాలపై వేసుకుంటుందన్నారు. మీడియా సమావేశంలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి, హుస్సేన్, సంతోష్‌రెడ్డి, చంద్రశేఖర్, మేరీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ

మేడ్చల్‌రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును బుధవారం మంత్రి మల్లారెడ్డి అందజేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన పార్టీ కార్యకర్త బట్టికాడి సహదేవ్ రోడ్డు ప్రమాదంలో మరణించగా బీమా చెక్కు రూ.2 లక్షలను మృతుడి భార్య భాగ్యలక్ష్మికి మంత్రి మల్లారెడ్డి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ అన్నారు. వార్డులో నూతన భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డును మున్సిపల్ నిధుల సహకారంతో అభివృద్ధి పథంలో నడుపుతున్నానని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. వార్డులోని అన్ని వీధుల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

అల్వాల్: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. డిఫెన్స్ కాలనీలో నివాసముండే తోటపల్లి దేవమణి కుమారుడు తోటపల్లి యశ్వంత్ (18) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు బుధవారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బయకు వెళ్లిన సమయంలో హాల్ టికెట్ తీసుకొని వెళ్లాడని పోలీసులకు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమరాల్డ్ పార్క్‌లో ఎన్నో వెతలు


సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

పోచారం: అన్నోజిగూడలోని ఎమరాల్డ్ పార్కు ఓనర్స్ అసోసియేషన్ అరాచకాలు రోజురోజుకూ అధికమవుతున్నాయంటూ బాధితులు వాపోయారు. బుధవారం అన్నోజిగూడలో కాలనీకి చెందిన బాధిత ఓనర్స్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమరాల్డ్ పార్క్ అసోసియేషన్ ఆర్థిక అవినీతికి పాల్పడుతూ నివాసితులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కొన్ని ఇళ్లకు వాటర్ సరఫరాతో పాటు డ్రైనేజీ కనెక్షన్లు తొలగించారంటూ ఆవేదనను వ్యక్తం చేశారు. 2018 నుంచి 2020 వరకు అసోసియేషన్‌కు చెల్లించిన మెయింటెనెన్స్ చార్జీలను వేరే ఖాతాలో జమచేసి అదే మొత్తాన్ని బకాయిలుగా చెల్లించాలని అసోసియేషన్ ఒత్తిడి చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. గత చెల్లింపులకు రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు తీసుకుని డ్యూస్ క్లియరెన్స్ లెటర్ ఇవ్వమంటే అలా ఇవ్వడం కుదరని అసోసియేషన్ పేర్కొనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఓనర్స్‌కు మౌలిక వసతులు కల్పించాల్సిన అసోసియేషన్ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మహిళలపై అమానుషంగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసు యంత్రాంగం స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాధితులు రామకృష్ణాచారి, డి.శ్రీనివాసరావు, చరణ్, వెంకట్ నారాయణ, హరిశంకర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వ్యవసాయ శాఖ మంత్రికి తెలంగాణ రైతు ఐక్య వేదిక వినతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఈదురు గాలులతో పాటు అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో వినతి పత్రం అంజేశారు. భారీ ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా మామిడి, నువ్వు, వరి, మొక్కజొన్న, ఎర్రజొన్న, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని నర్సారెడ్డి తెలిపారు. పంట నష్టాన్ని అధికార యంత్రాంగం వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేపట్టి, రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించి, ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తెలిపారు.

దేవాదాయ భూములను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూముల్లో స్థానికేతరులు గుడిసెలు వేసి కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మరళీగౌడ్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, యూత్ అధ్యక్షుడు జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం రిలీఫ్ ఫండ్‌కు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

రామంతాపూర్: రామంతాపూర్ నివాసి రాజ్‌కుమార్ కొంతకాలంగా కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు అవసరమయ్యే కిడ్నీ మార్పిడి చికిత్స కోసం ప్రైమినిస్టర్ నేషనల్ రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.3 లక్షల చెక్కును బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యం

రాష్ట్ర కార్మికశాఖ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి


మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: కేంద్రంలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యమని, బీజేపీ నాయకులవి మాటలు తప్ప చేసిందేమీ లేదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఎంఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రం అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీజేపీ నాయకులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏం అభివృద్ధి చేశారో తెలపాలన్నారు. సింగిల్ డిజిట్‌లో ఎమ్మెల్యేలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తామే అధికారంలోకి వస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని వర్గాల శ్రేయస్సుకు పాటు పడి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు మరోమారు ఆశీర్వదిస్తారని సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని తెలిపారు. కేంద్రంలో సైతం బీఆర్ఎస్ పార్టీ హవా నడుస్తోందన్నారు.

పెన్షన్లు రావడం లేదన్న వితంతులు, వృద్ధులు..

మంత్రి మల్లారెడ్డి తన ప్రసంగంలో ఏ రాష్ట్రంలోని లేనివిధంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 వేల పెన్షన్ ఇస్తోందని, పెన్షన్ తీసుకుంటున్న వారు చేతులు పైకి ఎత్తాలని కోరారు. సమావేశానికి వచ్చిన వృద్ధులు చేతులు ఎత్తకపోవడంతో పాటు పెన్షన్ రావడం లేదని నినాదాలు చేశారు. అనంతరం వారి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సంజీవగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తూంకుంట మున్సిపాలిటీలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తూ..

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

శామీర్‌పేట్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని రాష్ట్ర కార్మికశాఖ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటీలోని హకీంపేట, సింగాయిపల్లి 8, 9 వార్డుల్లో బస్తీ దవాఖాన, సీసీ రోడ్డు, చాకలి ఐలమ్మ విగ్రహం ఓపెన్ జిమ్‌లను మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు.